నేటి దినపత్రిక
17 వ
# సూర్య
www.suryaa.com
ఏలూరు జిల్లా, పశ్చిమ గోదావరి జిల్లా
మంగళవారం,26 మార్చి 2024


## అభయాంజనేయ స్వామి ఆలయంలో టీడీపీ అభ్యర్థి మహేష్ యాదవ్ పూజలు

**హనుమాన్ జంక్షన్, మేజర్‌న్యూస్:** జనసేన,బీజేపీ పార్టీలు బలపరిచిన ఏలూరు పార్లమెంటు తెలుగుదేశం పార్టీ అభ్యర్థి పుట్టా మహేష్ యాదవ్ తొలిసారి నియోజకవర్గానికి విచేస్తున్న సంధర్భంగా సోమవారం హనుమాన్ జంక్షన్‌లోని అభయాంజనేయ స్వామి వారి దేవస్థానం నందు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాల్లో దెందులూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి చింతమనేని ప్రభాకర్ , నూజివీడు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కొలుసు పార్థసారధి, తెలుగుదేశం పార్టీ నాయకులు మాజీ ఎమ్మెల్యే గంటా మురళీ రామకృష్ణ ,అట్లూరి రమేష్ , యనమదల రమేష్, క్లస్టర్ ఇన్చార్జి యనమదల నాని, వాసు ,వేమూరి శ్రీనివాసరావు, వడ్డి వాసవి, జగ్గవరపు ముత్తారెడ్డి వివిధ నియోజకవర్గాలకు చెందిన నాయకులు ,కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



### ఉమ్మడి పశ్చిమలో

# 5 సీట్లలో జనసేన పోటీ

- అన్ని స్థానాలు గెలుచుకునేందుకు టిడిపి, బిజెపితో ప్రణాళిక
- కైకలూరు బీజేపీకే !



**ఏలూరు, సూర్య బ్యూరో:** ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో జనసేన పార్టీ 5 స్థానాల్లో పోటీ చేస్తోంది. అందులో ఏలూరు పార్లమెంటరీ స్థానంలో 2, నరసాపురం పార్లమెంటరీ స్థానంలో 3 చోట్ల పోటీ చేస్తోంది. గతంలోనే, టిడిపి, బిజెపితో పొత్తు కుదరక ముందే 'సూర్య' దినపత్రిక ' ఉమ్మడి పశ్చిమలోజనసేనకు 5 సీట్లు' అని ప్రచురించింది. ఇంకా జిల్లాలోని 14 అసెంబ్లీ స్థానాలకు గాను ఒక్క కైకలూరు స్థానం అభ్యర్థి ఎవరో ఇంకా బిజెపి ప్రకటించలేదు. అక్కడ నుండి మాజీ మంత్రి కామినేని శ్రీనివాస్ పోటీకి సిద్ధంగా ఉండగా, గారపాటి (తపన) చౌదరి పేరు కూడా ప్రస్తావనకు వచ్చినట్టు సమాచారం. కాగా జనసేన పార్టీ ఏలూరు పరిధిలో ఉంగుటూరు, పోలవరంలో, నర్సాపురం పరిధిలో భీమవరం, నర్సాపురం, తాడేపల్లిగూడెం అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోటీ చేస్తోంది. ఈ మూడు స్థానాల్లో కాపు సామాజిక వర్గం అధికంగా ఉంది. ఇక పోలవరం ఎస్టీ రిజర్వుడు స్థానం. ఉంగుటూరు జనరల్.ఇక్కడ నుండి పత్సమట్ల ధర్మరాజు,పోలవరం నుండి చిర్రి బాలరాజు, తాడేపల్లిగూడెం నుండి బొలిశెట్టి శ్రీనివాస్, భీమవరం నుండి మాజీ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు, నర్సాపురం నుండి మరోసారి బొమ్మిడి నాయకర్ ( బీసి మత్స్యకార) పోటీ చేస్తున్న విషయం తెలిసిందే. గతంలో నరసాపురం పార్లమెంటరీ స్థానం నుండి పోటీ చేసిన జనసేన ఈసారి కేవలం అసెంబ్లీ స్థానాలు పైనే దృష్టి పెట్టింది. ఇక అభ్యర్థుల తరపున జనసేన అధినేత పవన్ కళ్యాణ్ తో పాటు, టిడిపి అధినేత చంద్రబాబు, బిజెపి అగ్ర నాయకులు ఉమ్మడి ప్రచారానికి, విడిగా ప్రచారానికి కూడా రానున్నారు. గత ఎన్నికల్లో పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ తో సహా పోటీ చేసిన వారందరూ ఓటమి పాలయ్యారు. ఈసారి ఎన్నికల్లో పొత్తు కుదిరినందువల్ల పోటీ చేస్తున్న 5 సీట్లు గెలుచుకోవాలనే లక్ష్యంతో జనసేన పార్టీ వడివడిగా, వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది.

### రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే

# మళ్లీ టీడీపీ అధికారంలోకి రావాలి



ఏలూరు ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్ యాదవ్



**ఏలూరు,మేజర్‌న్యూస్:** ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి చెందాలంటే తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావాలని ఏలూరు పార్లమెంట్ టిడిపి బిజెపి - జనసేన ఉమ్మడి అభ్యర్థి పుట్టా మహేష్ యాదవ్ అన్నారు.ఏలూరు పార్లమెంట్ పరిధిలో ఉన్న నియోజక వర్గాల ఉమ్మడి పార్టీల ఎంఎల్ఏ అభ్యర్థులతోను ఆయా నియోజక వర్గాల నాయకులు కార్యకర్తలతో పుట్టా మహేష్ యాదవ్ తొలిపరిచయ కార్యక్రమం ఏలూరు జిల్లా టిడిపి కార్యాలయంలో సోమవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ఏలూరు పార్లమెంట్ పరిధిలో ఉన్న అన్ని నియోజక వర్గాలనుండి టిడిపి,బిజెపి, జనసేన పార్టీల శ్రేణులు పెద్ద ఎత్తునపుట్టా మహేష్ యాదవ్ పరిచయ వేదికకు హాజరయ్యారు. ఆయనను పలువురు బొకేలు, శాలవులతో సత్కరించారు. ఈ సందర్భంగా మహేష్ యాదవ్ మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి పాలనలో అభివృద్ధి కుంటు పడిందన్నారు.రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే టిడిపి మళ్ళీ అధికారం లోకి రావాలన్నారు.చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలన్నారు.మహిళల అభివృద్ధిరాష్ట్రంలో పరిశ్రమలు రావాలంటే చంద్రబాబు అధికారంలోకి రావాలన్నారు.వైసిపి పాలనలో టిడిపి నాయకులపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేస్తామన్నారు.తనను ఏలూరుపార్లమెంట్‌లోఒకబిడ్డగాను.అన్నగాను.తమ్ముడుగాను ఆదరించి, ఆశీర్వదించి ఏలూరు ఎంపిగా నాకు అఖండ విజయాన్ని అందించాలని పుట్టా మహేష్ యాదవ్ కోరారు.ఈకార్యక్రమంలోఏలూరు పార్లమెంటరీ నియోజకవర్గం పరిధిలోని అభ్యర్థులుచింతమనేని ప్రభాకర్, బడేటి చంటి,అభ్యర్థి సొంగా రోషన్ కుమార్.ఉంగుటూరు ఉమ్మడి అభ్యర్థి పత్సమట్ల ధర్మరాజుమాజీఎంఎల్ఏ,పార్టీజిల్లా అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు,మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళిరామకృష్ణ, మాజీ మంత్రి మరడాని రంగారావు, జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల నుండి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# వాలంటీర్ల జోలికి వస్తే ఖబడ్దార్

- డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ



**తాడేపల్లిగూడెం,మేజర్‌న్యూస్:** వాలంటీర్లపై నోటికి వచ్చినట్లు అవాకులు చవాకులతో అనవసర ప్రేలాపనలు పేలితే సహించేది లేదని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, దేవదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ తీవ్ర స్థాయిలో హెచ్చరించారు. టిడిపి నాయకుడు బొజ్జల సుధీర్ వాలంటీర్లను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలపై సోమవారం రాత్రి ఆయన స్పందిస్తూ మీడియాతో మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన వాలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రభుత్వం ప్రజలకు దగ్గర అయిందన్నారు. నిరుద్యోగులైన 2 లక్షల50 వేల మంది యువతీ యువకులు సేవాభావంతో వాలంటీర్లుగా పనిచేస్తున్నారు అన్నారు. వారంతా మన ఇరుగుపొరుగు పిల్లలేనని మంత్రి కొట్టు పేర్కొన్నారు. అలాంటి వారిని పట్టుకుని పాకిస్తాన్, ఆఫ్గనిస్తాన్ టెర్రరిస్టులుగా, స్లీపర్ సెల్స్ గా మాట్లాడటాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. వాలంటీర్లు వారి పరిధిలోని 50 కుటుంబాలలోను కుటుంబ సభ్యులుగా మమేకమయ్యా రన్నారు. ఇటువంటి నీచులు పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. వాలంటీర్ వ్యవస్థతో ప్రభుత్వానికి మంచి పేరు రావడం చూసి తట్టుకోలేక విషం చిమ్ముతున్నారన్నారు.

# ఎన్నికలపై పార్టీలు, నాయకులు పూర్తి అవగాహన కలిగి ఉండాలి



**భీమవరం, మేజర్ న్యూస్:** సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి సాధారణ ప్రవర్తనపై రాజకీయ పార్టీలు, అభ్యర్థులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు .

జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ సాధారణ ప్రవర్తనకు సంబంధించి వివరిస్తూ ప్రస్తుతంవున్న విభేదాలను పెంచేలా, పరస్పర ద్వేషాలను కలుగజేసేలా, విభిన్న కులాలు, వర్గాలు, మతాలు లేదా భాషల మధ్య ఉద్రిక్తతకు దారితీసె ఎట్టి కార్యకలాపానికిపార్టీగానీ, అభ్యర్థిగాని పాల్పడ కూడదన్నారు. ఓట్లను పొందడానికి మతం, వర్గం, కులం భావాలతో అభ్యర్థించకూడదన్నారు. దేవాలయాలు, మసీదులు, చర్చి మొదలగునటు వంటి ఆరాధన ప్రదేశాలను ఎన్నికల ప్రచారానికి వేదికగా ఉపయోగించకూడదని తెలిపారు. అభ్యర్థుల వ్యక్తిగత జీవితానికి సంబంధించి అతని ప్రజా జీవితంతో సంబంధంలేని ఏదేని అంశంపై విమర్శను చేయరాదన్నారు. పరిశీలించలేని వాస్తవాలు, సంఘటనలపై ఆధారపడే ఏవేని ఆరోపణలను చేయకూడదన్నారు. ఒక రాజకీయ పార్టీని విమర్శించేటపుడు, దాని విధానాలు, కార్యక్ర మాలు, గత రికార్డు, పనులకు పరిమితం చేయాలిసి ఉందన్నారు. పరిశీలించలేని ఆరోపణల ఆధారంగా విమర్శలను చేయకూడదన్నారు. వ్యక్తుల గృహాల ముందు, వారి అభిప్రాయం లేదా కార్యకలాపానికి నిరసనను తెలియజేస్తూ ప్రదర్శన లేదా పికెటింగులను ఏర్పాటు చేసే కార్యకలాపాలకు ఎట్టి పరిస్థితులలోను పాల్పడకూడదన్నారు.మరో అభ్యర్థి లేదా రాజకీయపార్టీ అమర్చిన జెండాను, అంటించిన పోస్టరును ఏ అభ్యర్థి లేదా అతని కార్యకర్తలు తొలగించడం, చెరిపివేయడం చెరాదన్నారు.

**ఎన్నికల చట్టం క్రింద అవినీతి పద్దతులు, నేరాలుగా వున్న అన్ని కార్యకలాపాలను అన్ని పార్టీలు, అందరు అభ్యర్థులు తప్పనిసరిగా నివారించాలి:** మతం, కులం, వర్గం ప్రాతిపదికన ఓట్లను వేయమని లేదా ఓట్లను వేయవద్దని అభ్యర్థించడం, ఓట్లను అభ్యర్థించడానికి ఏదేని మతపరమైన గుర్తును ఉపయోగించడం చేయరాదు. పబ్లిషరు పేరు, చిరునామాను పేర్కొనకుండా ఏదేని పోస్టరు, పాంప్లెటు, లీఫ్ లెట్, సర్క్యులరు, ప్రకటనను ముద్రించడం, ప్రచురించడం చేయరాదు. అభ్యర్థి వ్యక్తిగత ప్రవర్తన, నడవడికకు సంబంధించి అతని లేదా ఆమె ఎన్నిక అవకాశాలపై తీవ్రంగా ప్రభావం చూపాలనే ఉద్దేశంతో అసత్యమయిన లేదా నిజమని నమ్మలేని ప్రకటనను లేదా వార్తా అంశాన్ని ప్రచురించడం చేయకూడదని పేర్కొన్నారు.



# నకిలీ మందుల జోరు - రైతు కంట కన్నీరు

### కొరవడిన అధికారుల పర్యవేక్షణ

**పెంటపాడు, మేజర్ న్యూస్:** ఒక ప్రక్క రైతు గిట్టుబాటు ధర లేక బెంబేలెత్తి పోతుంటే నకిలీ మందులు మరోపక్క రైతుని నిలువునా కూల్చి వేస్తున్నాయి. ప్రభుత్వ అధికారుల పర్యవేక్షణ సక్రమంగా లేకపోవడంతో నకిలీ మందులతో పాటు బయో కెమికల్ మందులు విచ్చలవిడిగా మార్కెట్లోకి రావడంతో వేటిని విశ్వసించాలో, వేటిని వినియోగించాలో తెలియని రైతులు నిలువునా మునిగిపోతున్నారు. పంట మరో 15 రోజుల్లో చేతికి వస్తుందన్న తరుణంలో చివరిసారిగా కొట్టే మందులలో సైతం లెక్కలేనన్ని నకిలీ మందులు రావడం ఫలితంగా రైతు ఇంట పంట బదులు కంట కన్నీరు వస్తుంది. రైతుకు మరో ప్రత్యామ్నాయం లేక, పెద్దగా చదువుకోని రైతులు, కౌలు రైతులు అప్పుల పాలై పోతున్నారు. ప్రభుత్వాలు ఎన్ని పథకాలు పెట్టినా సరైన మందు సరైన సమయంలో అందకపోతే ఫలితం రైతు కంట కన్నీరే. అన్ని బాగున్నాయి అని అనుకునే లోపు వరుణుడు కరుణించకపోతే ఆ పంట నీటి పాలవుతుంది. నాటు వేసిన నాటి నుండి పంట చేతికందే అంతవరకు అనుక్షణం రైతు భయభ్రాంతులకు లోనవుతున్నాడు. పురుగుమందుల వారి వికృత ప్రయోగాల ను ఉన్నతాధికారులకు తెలియజేసే పరిస్థితి లేదు. అలా అధికారులకు ఫిర్యాదు చేద్దామంటే వారు స్పందించడం లేదని బాహాటంగావిమర్శలు వినిపిస్తున్నాయి.పలుచోట్ల ఉన్నతాధికారుల నిర్లక్ష్యంగా ఉండటంవల్ల బయోకెమికల్ వాడకాలు పెరిగిపోయాయని, ఫలితంగా ఆశించిన రీతిగా పంట దిగుబడి రావడం లేదని, ఇంకోసారి పంటచేతికి అందకుండా ఎండిపోతుందని పలువురు రైతులు బాహాటంగా విమర్శిస్తున్నారు. ఈ మధ్యకాలం పెంటపాడు మండలంలో పలుచోట్ల సుమారు 30 ఎకరాల వరి పైరు చేతికొచ్చే సమయంలో పంట నాశనం అయిపోయిందని, పురుగులు మందులే దీనికి కారణం అంటూ రైతుల బాహాటంగానే విమర్శిస్తున్నారు. అధికారుల పట్ల ప్రేమను కురిపించే రైతు సైతం అందుబాటులో లేని రైతు భరోసా కేంద్రాలు రైతు సంక్షేమాలు ఎందుకని విమర్శిస్తున్నారు. ఈ నకిలీ మందుల వ్యాపారస్తులపై ఉన్నతాధికారులు ఇకనైనా కొరడా జులిపించవలసి ఉందని పలువురు రైతులు కోరుతున్నారు.

# కైకలూరు సీటు జనసేనకు కేటాయించాలి

### సమన్వయకర్త సిఎబివి రావు



**కైకలూరు, మేజర్‌న్యూస్** : కైకలూరు జనసేన పార్టీ కార్యాలయంలో జనసేన సమన్వయకర్త బీవీ రావు సోమవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలోమాట్లాడుతూ కైకలూరు సీటు జనసేనకు ఇవ్వాలని, ఆసీటుతనకు కేటాయించాలని నియోజక వర్గ సమన్వయకర్త సిఏబీవీ రావు పేర్కొన్నారు.
ఈ మేరకు జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కు విజ్ఞప్తి చేస్తున్నాం అన్నారు. జనసేన పార్టీ అధిష్టానం ప్రకటించిన 21 సీట్లలో కైకలూరు నియోజకవర్గం లేకపోవడం చాలా బాధాకరమని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.2019లో బిసి యాదవ సామాజిక వర్గానికి చెందిన నాకు పవన్ కళ్యాణ్ అసెంబ్లీ సీటు కేటాయించారని, అప్పుడున్న ప్రత్యేక పరిస్థితులలో హేమహేమీలను ఢీకొని నియోజకవర్గం మొత్తం ఉన్న కొద్దిపాటి సమయంలో 11వేల ఓట్లను సాధించామని తెలిపారు.

అప్పటినుంచి జనసేన పార్టీ తరపున ప్రతి కార్యక్రమాన్ని చేస్తూ, నియోజకవర్గంలో 52 గ్రామాలలో జనసేన జనభేరి పాదయాత్ర చేసి కూటమి తరుపున పవన్ , చంద్రబాబు షూరిటీ భవిష్యత్తు గ్యారంటీ లాంటి పథకాలను, పవన్ కళ్యాణ్ ఆశయాలను జనసేన పార్టీ సిద్ధాంతాలను ప్రజలలోకి తీసుకువెళ్లామని తెలిపారు.ప్రజల మద్దతు పొందామని, జనసేన పార్టీ తరపున తనకు సీటు ఇస్తే ఖచ్చితంగా గెలుపు ఖాయమని చెప్పారు. పార్టీ అధిష్టానం ఇప్పటి వరకూ కూడా తాను చేస్తున్న కార్యక్రమాలను ప్రోత్సహిస్తూనే వచ్చిందని కరోనా కష్టకాలంలో కైకలూరు నియోజకవర్గంలో ప్రజలకు ఇంటింటికి వెళ్లి కూరగాయలు, నిత్యవసర సరుకులు పంచిన ఏకైక నాయకుడుని తానేనని బివి రావు స్పష్టం చేశారు. అదే విధంగా సంక్రాంతి కానుకగా ప్రతి మండలంలో సుమారుగా 5000 మందికి 9రకాల నిత్యవసర సరుకులను పంపిణీ చేశామనితెలియజేశారు. అధిష్టానం కూడా ప్రజాభిప్రాయాలను జనసైనికులు అభిప్రాయాలను పరగణనలోకి తీసుకోవాలని, ఏ సర్వే ప్రకారం చూసినా కైకలూరులో జనసేన పార్టీనే ,బీవీ రావే ముందంజలో ఉంటాడని చెప్పారు. తనకు సీటు కేటాయిస్తే కచ్చితంగా జనసేన జెండా ఎగరవేస్తానని తాను అన్ని రకాలుగా ఈ ఎన్నికలకు ఆర్థిక, అంగ బలము తో తయారుగా ఉన్నానని ప్రజల అభీష్టం మేరకు జనసైనికుల కోరిక మేరకు పవన్ కళ్యాణ్ తనకు సీటు కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన గౌరవాధ్యక్షులు పోకల దేవేంద్ర గోపాలకృష్ణ, కోట విప్లవ వరప్రసాద్, నాగన బోయిన విజయకుమార్, మోరు విజయ రాజు, నాగదేసి గణేష్ బాబు, బొండాడ రాఘవ,డాక్టర్ శివరామకృష్ణ యాదవ్ జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎన్నికల నియమావళి ఉల్లంఘనలపై నిరంతర నిఘా

### ఉల్లంఘించినట్లు సి-విజిల్‌కు ఫిర్యాదు అందిన 100 నిమిషాల్లోనే చర్యలు

కలెక్టరేట్ కాల్ సెంటర్ నెంబర్ 18002331077

**ఏలూరు,మేజర్‌న్యూస్:** ప్రజాస్వామ్యం మనుగడకు ఎన్నికలే మూలాధారం. ఎన్నికల ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, నిష్పక్షపాతంగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ కృషి చేస్తున్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు, ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించేందుకు,వారివినతులస్వీకరణకు వివిధ వ్యవస్థలను అందుబాటులో ఉంచారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన వెంటనే ఏర్పాటైన ఈ ఎలక్షన్ కంట్రోల్ రూమ్‌లో కంప్లయింట్ సెల్ ముఖ్యమైన పాత్రను పోషిస్తోంది. దీని ఆధ్వర్యంలో సి-విజిల్, కాల్ సెంటర్, 1950 హెల్ప్‌లైన్ తదితర విభాగాలను ఏర్పాటు చేశారు. ఈ ఎన్నికల కంట్రోల్ రూమును జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ నేతృత్వం లో జిల్లా రెవిన్యూ అధికారి డి. పుష్పమణి పర్యవేక్షిస్తున్నారు. సి విజిల్ కంప్లయింట్ సెల్‌కు జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి ఎన్ ఎస్ కృపవరం, సోషల్ మీడియాకుఉద్యాన శాఖ డిప్యూటీ డైరెక్టర్ రామ్మోహన్‌పర్యవేక్షణాధికారులుగా వ్యవహరిస్తున్నారు.

**అక్రమాలపై ఉక్కుపాదం మోపే సి విజిల్ యాప్**

ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అమలు చేసేందుకు, అక్రమాలపై వీలైనంతవేగంగా,సాక్షాధారాలతో సహాఫిర్యాదు చేసేందుకు ప్రజలకిచ్చిన గొప్ప అవకాశం సి-విజిల్ మొబైల్ యాప్. ఇటీవలే అందుబాటులో వచ్చిన ఈ యాప్ ను పౌరులు ఎవరైనా గూగుల్ ప్లే స్టోర్ నుంచి తమ మొబైల్‌కు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఏదైనా అంశంపై ఫిర్యాదు చేయడానికిఈయాప్‌నుతెరిచి,విండోలో సంబంధిత అంశానికి సంబంధించిన ఫొటో లేదా 2 నిమిషాల వీడియో



ఫైల్ ఫోటో

తీసి లైవ్‌గా అప్‌లోడ్ చేయాలి. దాని గురించి క్రిందన కొన్ని వ్యాఖ్యాల్లో వివరించవచ్చు. కేవలం లైవ్ ఫొటోలు, వీడియోలను, జియో కోర్డినేట్స్‌తో సహా ఇది స్వీకరించి పంపుతుంది. ఆ అంశాన్ని స్క్వాడ్ పరిశీలించి, కేవలం 100 నిమిషాల్లోనే చర్యలు తీసుకుంటారు.

**ఓటర్ హెల్ప్‌లైన్ 1950..** ఓటర్లకు అన్ని రకాల సహాయ సహకారాలను అందించేందుకు ఎన్నికల కమిషన్ ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ ఇది. ఈ టోల్‌ఫ్రీ నంబరుకు జిల్లాకు చెందిన ఓటర్లు నేరుగా ఫోన్ చేసి తమ , సమస్యలను తెలియజేయవచ్చు. కావాల్సిన సేవలను పొందవచ్చు.

**24 గంటల కాల్ సెంటర్..** ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించిన వెంటనే, ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జిల్లా స్థాయి కాల్ సెంటర్ ఏర్పాటయ్యింది. ఫోన్ నెంబర్లు 18002331077 కి ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చు. ఇది కూడా 24 గంటలూ పనిచేస్తుంది.

**ఎన్‌జిఎస్ పోర్టల్..** నేషనల్ గ్రీవెన్స్ సర్వీస్ పోర్టల్ వెబ్ సైట్‌లో ఓటర్లు నేరుగా ఫిర్యాదు చేయవచ్చు. అలాగే ఓటర్ హెల్ప్‌లైన్, ఓటర్ పోర్టల్, ఓటర్ మిత్రా లో కూడా ఫిర్యాదు చేయవచ్చు. తమ వినతులను అందజేయవచ్చు.

**సాక్ష్యం యాప్..** ఇది ప్రత్యేకంగాదివ్యాంగులకోసం రూపొందించింది. సదరంప్రకారం40 శాతం వికలాంగత్వం దాటిన దివ్యాంగులు ఇంటినుంచేవివిధసేవలనుపొందే అవకాశాన్ని ఎన్నికల కమిషన్ కల్పించింది. దీనికోసంసాక్ష్యం (ఎస్ఏకెఎస్‌హెచ్ఎఎం)యాప్‌లోధరఖాస్తుచేసుకోవాల్సి ఉంది.

**మీడియా మోనటరింగ్‌సెల్..** పత్రికలు,ఎలక్ట్రానిక్ మీడియా లో ఎన్నికలకు సంబంధించి వచ్చే వార్తలు, వ్యతిరేక వార్తలు,ప్రకటనలను ఈ విభాగం నిరంతరం పరిశీలిస్తుంది. ముఖ్యంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనపై వచ్చే వార్తలపై ప్రత్యేక దృష్టి సారిస్తుంది. ఎన్నికల కోడ్ ఉల్లంఘన, అనధికార ప్రకటనలు, అనుమతి లేని ప్రచార వార్తలు, పెయిడ్ న్యూస్‌ను సేకరించి చర్యల నిమిత్తం సంబంధిత ఆర్ఓలకు పంపిస్తారు. ఇప్పుడు ఎన్నికల ప్రక్రియలో సోషల్ మీడియా అత్యంత చురుకైన పాత్రను పోషిస్తోంది. ఫేస్‌బుక్, ఎక్స్(ట్విట్టర్), ఇన్‌స్టాగ్రామ్, యుట్యూబ్ తదితర సోషల్ మీడియాపై నిరంతరం నిఘా పెట్టేందుకు ఈవిభాగంఏర్పాటయ్యింది. సోషల్ మీడియాలో వచ్చే ఎన్నికల ప్రచారం, ప్రకటనలు, పోస్టింగులపై ఈ విభాగం అధికారులు నిరంతరం పర్యవేస్తున్నారు.

**రిపోర్ట్స్ మోనటరింగ్ సెల్..** వివిధ విభాగాలకు వచ్చే ఫిర్యాదులు, జిల్లాలో నమోదు చేసిన కేసులు, వాటిపై తీసుకున్న చర్యలను జిల్లా ఎన్నికల అధికారి ద్వారా ముఖ్య ఎన్నికల అధికారికి ప్రతిరోజూ పంపించడం జరుగుతుంది. అన్ని విభాగాలనుంచి రిపోర్ట్స్ సేకరించి, తుది నివేదికను తయారు చేస్తారు. ఈ రిపోర్ట్స్ మోనటరింగ్ విభాగాన్ని జడ్పీ సీఈవో కె.సుబ్బారావు పర్యవేక్షిస్తున్నారు.

సూర్య
పశ్చిమ గోదావరి
మంగళవారం
26 మార్చి 2024
2

## ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలి



**జీలుగుమిల్లి,మేజర్‌న్యూస్:** తెలంగాణ రాష్ట్రం నుండి వచ్చే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని పోలవరం నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఐటీడీఏ పీవో ఎం సూర్య తేజ సిబ్బందిని ఆదేశించారు. సోమవారం ఆంధ్ర తెలంగాణ రాష్ట్ర సరిహద్దు వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సిబ్బంది జాగ్రత్తగా ఉండాలని ఆదేశించారు. నియోజకవర్గ పరిధిలో 8 ఫ్లేయింగ్ స్క్వాడ్లు ,నాలుగు వీడియో సర్వీస్ టీములు, నాలుగు స్టేటాస్టిక్ సర్వీస్ లెంత్ టీమ్లు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. 50 వేల రూపాయలకు మించి నగదును పట్టిక వెళితే తగిన రసీదులు చూపించాలని అన్నారు.ఎన్నికల నియమావళి ప్రతి ఒక్కరు పాటించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో చెక్ పోస్ట్ ఈఈపివి ఎస్ ప్రసాద్ సిబ్బంది పాల్గొన్నారు.

## బిజెపి నాయకుడు రావూరి సుధా కారు ధ్వంసం




**పాలకొల్లు,మేజర్‌న్యూస్:** స్థానిక చవటపల్లి వారి వీధిలో నివాసం ఉంటున్న కాకినాడ పార్లమెంటు నియోజకవర్గం ఇంచార్జ్ రావూరి లక్ష్మణస్వామి (సుధా) కారును శనివారం రాత్రి గుర్తు తెలియని దుండగులు ఇన్నోవా కారు అద్దాలను ధ్వంసం చేయడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.48 గంటలు గడిచిన పోలీసులు చర్యలు తీసుకోలేదని సుధా ఆవేదన వ్యక్తం చేశారు, ప్రతిపక్షాల కుట్ర అయి ఉంటుందేమోనని అనుమానం వ్యక్తం చేస్తున్నారు, తనకు ప్రాణహాని పొంచి ఉందేమోనని అనుమానం కలుగుతోందని తన కుటుంబానికి రక్షణ కల్పించాలని ఆయన కోరారు,

### ఎలక్ట్రానిక్ మీడియాలో రాజకీయ ప్రకటనలకు

# ఎంసీఎంసీ ఆమోదం తప్పనిసరి

### -జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్



**ఏలూరు,మేజర్‌న్యూస్ :** ఎన్నికల నేపథ్యంలో ఎలక్ట్రానిక్ మీడియాలో రాజకీయ ప్రకటనలకు తప్పనిసరిగా మీడియా సర్టిఫికేషన్-మానిటరింగ్ కమిటీ (ఎంసీఎంసీ) కమిటీ నుంచి ముందస్తు ఆమోదం పొందాలని జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ ఒక ప్రకటనలో తెలిపారు.జిల్లా స్థాయిలో ప్రసారం చేసే ప్రకటనలకు జిల్లా ఎంసీఎంసీ కమిటీ ఆమోదం తెలపాల్సి ఉంటుందన్నారు.పెయిడ్‌న్యూస్, రాజకీయ ప్రకటనలను తనిఖీచేసేందుకు జిల్లా స్థాయులో ఎంసీఎంసీ కమిటీని నియమించడం జరిగిందన్నారు.
ఎలక్ట్రానిక్ మీడియాలో రాజకీయ ప్రకటనలు ప్రసారం చేయదలచిన తేదీకి కనీసం మూడ్రోజుల ముందు సంబంధిత రిజిస్టర్డ్ రాజకీయ పార్టీలు దరఖాస్తు చేసుకోవాలని,ఆ తర్వాత రెండ్రోజుల్లో దానిపై కమిటీ నిర్ణయం తీసుకుంటుందన్నారు.
ఎలక్ట్రానిక్ మీడియా రాజకీయ ప్రకటనలపై ఈసీ నిబంధనలను పాటించాలన్నారు.వార్తల ముసు గులో రాజకీయ పార్టీలు అన్ని రకాల మీడియాలలో ఇచ్చే ప్రకటనలను ఎంసీఎం స్క్రూటినీ చేస్తుందన్నారు. ఎంసిఎంసి మానిటరింగ్ సెల్‌ను ఏలూరు జిల్లా కలెక్టరేట్‌లో ఏర్పాటుచేయడం జరిగిందన్నారు.

# వైసిపికి రాజీనామా

### త్వరలో కాంగ్రెస్‌లో చేరిక
### ..సీటు ఇస్తే ఎమ్మెల్యేగా పోటీ

**రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి బొడ్డు నోబుల్ వెల్లడి**

**కైకలూరు,మేజర్‌న్యూస్ :** గత కొంతకాలంగా వైసిపి కార్యక్రమాలకు దూరంగా ఉంటూ వచ్చిన దళిత నేత బొడ్డు నోబుల్ సోమవారం ఆయన నివాసం వద్ద మీడియా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వైయస్ మరణం తరువాత అప్పటి బ్లాక్ కాంగ్రెస్ పదవి వదులుకొని కైకలూరు నియోజకవర్గంలో మొదటిగా వైసిపి జెండాను నేను ఎగరవేసేనని తెలిపారు. అంతేకాకుండా 2014లో కైకలూరు అసెంబ్లీ సీటు ఉప్పాల రాంప్రసాద్ కి కేటాయించగా ఆయన గెలుపు కోసం మనస్ఫూర్తిగా పనిచేశానని ఆ తరువాత 2019లో దూలం నాగేశ్వరరావు విజయం కోసం దళిత నాయకులు అందరూ కలిసి పనిచేసే మని అన్నారు. గెలుపొందిన తరువాత ఆయనలో మార్పు రావడం దళితుల్ని నిర్లక్ష్యం చేయటం కాకుండా నేను ఏ పని చేయకుండా నన్ను కట్టడి చేశారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీలో అప్పటివరకు జాడలేని ఆయన కుమారులు తెరపైకి వచ్చి అంతా మా ఇష్టారాజ్యం అంటూ కొంతమంది రౌడీ మూకలను వెంట వేసుకొని అన్ని వర్గాల వారిపై దాడులు చేయటం,ఎదురు తిరిగిన వ్యక్తులపై దాడులు చేయించి అక్రమ కేసులు బనాయించటం అడ్డు అదుపు లేకుండా పోయిందని ఆయన మండిపడ్డారు. ఇలా అయితే వైసీపీ పార్టీకి చెడ్డ పేరు వస్తుందని నేను నచ్చ చెప్పే ప్రయత్నం చేసిన వినకుండా మార్కెట్ యార్డ్ బహిరంగ సభలో నన్ను తీవ్రమైన పదజాలాలతో దూషించారని ఆవేదన చెందారు. పార్టీ కోసం నీతిగా నిజాయితీగా పనిచేసిన ఎంతోమంది నాయకులను దూరం చేసుకుని పార్టీతో సంబంధంలేని వ్యక్తులను తీసుకువచ్చి వారికి పదవులు కట్టబెట్టారని, అంతేకాకుండా అధికారులను వాళ్ళ గుప్పిట్లో పెట్టుకుని ఎవరికన్నా చిన్న సంతకం కావాలన్నా వారి దగ్గర నుంచి అనుమతి తీసుకోవాల్సిన దౌర్భాగ్యమైన పరిస్థితిఈనియోజకవర్గంలో ఉందని నోబుల్‌విమర్శించారు. అనంతరం రాజీనామా లెటర్‌ని అధిష్టానానికి పంపించానని తెలిపారు.త్వరలో కాంగ్రెస్ పార్టీలో చేరి పార్టీ ఆదేశిస్తే ఎమ్మెల్యేగా పోటీ చేయటానికి నేను సిద్ధంగా ఉన్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో దళిత నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



### ఉపాధి హామీ కూలి గుండెపోటుతో మృతి




( ఫైల్ ఫోటో )

**తాడేపల్లిగూడెం,మేజర్‌న్యూస్:** తాడేపల్లిగూడెం మండలం మెట్ట ఉప్పర గూడెం గ్రామంలో ఉపాధి హామీ కూలి గుండెపోటుతో మృతి సంఘటన చోటు చేసుకుంది. ఉపాధి హామీ పనుల్లో సోమవారం ఉదయం ఉప్పర గూడెం గ్రామంలో పనిచేస్తుండగా గుండెపోటుకు గురై మర్లపూడి సులోమాన్ ఒక్క సారిగా కుప్పకూలిపోయాడు. వెంటనే స్పందించిన తోటి కార్మికులు చికిత్సకోసం ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మర్లపూడి సలోమాన్ మృతి చెందాడు. కుటుంబాన్ని వెంటాడిన మరణాలు. సులేమాన్ భార్య గతంలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. అనంతరం మరో రెండేళ్లలో కొడుకు కరోనా తో మృతి చెందాడు. దీంతో సులేమాన్ కోడలిని, మనవళ్ళను,పెంచుతూఆ కుటుంబా నికి పెద్దదిక్కుగా వ్యవహరించాడు. ఇప్పుడు ఇతని మృతితో కోడలు చిన్నపిల్లలు అనాధలు అయ్యారు. మర్లపూడి సలోమాన్ మృతితో ఉపాధి హామీ పథకం కూలీల సంఘం నాయకులు ఘటనా స్థలానికి చేరుకుని ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు.

# రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

### ఇద్దరు తీవ్రగాయాలతో ఆసుపత్రిలో చికిత్స



**పెదవేగి, మేజర్‌న్యూస్:** పెదవేగి మండలం చక్రాయగూడెంలో ఆదివారంరాత్రి జరిగిన ప్రమాదంలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందగా, ఇద్దరు తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పెదవేగి ఎస్ఐ రాజేంద్రప్రసాద్, స్థానికులు తెలిపిన వివరాలు ఇలాఉన్నాయి. పెదవేగి మండలం వేగివాడకు చెందిన మారగాని వీరవెంకట సత్యనారాయణకు తల్లి శేషారత్నం, భార్య పద్మ ఇద్దరు పిల్లలు ఉన్నారు. అతని తండ్రి నాగేశ్వరరావు చిన్నతనంలోనే చనిపోవడంతో తల్లితో కలిసి, ఐదుగురు చెల్లెళ్ళను పెంచి పెళ్ళిళ్ళు చేశాడు. వేగివాడ సెంటర్లో హొటల్ నిర్వహిస్తున్న సత్యనారాయణ ఆదివారం రాత్రి పదకొండు గంటల సమయం లో కొంతమంది టిఫిన్ చేసి, ఫోన్ ఫేలో సొమ్ము చెల్లించి వెళ్ళిపోతున్నారు. అయితే మొత్తం రూ.150లు కాగా, ఫోన్ ఫేలో చెల్లించింది రూ.15లు కావడంతో తన సోదరి చిడిబొమ్మ మణి, కుమార్తె పురంధరేశ్వరితోపాటు ద్విచక్రవాహనంపై ఏలూరువైపు వెళ్తున్న వ్యక్తులను కిలోమీటరు దూరం వెంబడించి, తిరిగి వేగివాడ వస్తున్నారు. అదే సమయంలో ఏలూరువైపు నుంచి వస్తున్న కారు వేగంగా వచ్చి ద్విచక్రవాహనాన్ని వెనుకవైపునుంచి ఢీకొట్టి, వందమీటర్లకు పైగా దూరం ఈడ్చుకెళ్ళిన తరువాత మారగాని వీరవెంకట సత్యనారాయణ(48) అక్కడికక్కడే మృతి చెందగా, అతని సోదరి చిడిబొమ్మ మణి, తొమ్మిదో తరగతి చదువుతున్న కుమార్తె పురంధరేశ్వరి తీవ్ర గాయాలపాలయ్యారు. కాగా ప్రమాదానికి కారణమైన కారు ద్విచక్రవాహనాన్ని కిలోమీటరు పైగా దూరం ఈడ్చుకెళ్ళింది. కొంతమంది గ్రామస్తులు ఆ కారును వెంబడించగా ఆ కారు కె. కన్నాపురం మీదుగా దెందులూరు మండలం చల్లచింతలపూడి దగ్గరలో పోలవరం కాలువలో బోల్తా పడింది దీంతో గ్రామస్తులు కారును నడుపుతున్న తడికలపూడికి చెందిన శిరుగుబత్తుల నవీన్ అనే యువకుడితోపాటు కారులో ఉన్న మరో ఇద్దరు యువకులను పట్టుకుని పెదవేగి పోలీసులకు అప్పగించారు. మృతుడు సత్యనారాయణకు తొమ్మిదో తరగతి చదువుతున్న కుమార్తె పురందరేశ్వరితోపాటు వికలాంగుడైన పదో తరగతి చదువుతున్న కుమారుడు ఉన్నారు. సత్యనారాయణ మృతితో గ్రామంలో విషాదం నెలకొంది. చిన్నతనంనుంచి ఎంతో కష్టపడి కుటుంబాన్ని పోషించిన అతని కుటుంబం దిక్కుతోచని పరిస్థితిలో పడిపోయిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. దీనిపై కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ రాజేంద్రప్రసాద్ తెలిపారు.

### పెదమైనవానిలంకలో ఎమ్మెల్యే ముదునూరి ప్రచారం



**నరసాపురం రూరల్, మేజర్‌న్యూస్ :** అందరిని ఆప్యాయంగా పలకరిస్తూ, సంక్షేమ పథకాల అమలు తీరునుఅడిగి తెలుసుకుంటూ మళ్లీ ఓట్లు వేయాలని వైసీపీ అభ్యర్థి రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాద్ రాజు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సోమవారంమండలంలోని పెదమైన వానిలంకలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి సహకారంతో నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశానని, మరింత అభివృద్ధి కోసం వైసీపీకి ఓట్లు వేసి గెలిపించాలనిఆయన కోరారు. మున్సిపల్ చైర్ పర్సన్ బర్రె శ్రీ వెంకటరమణ, అండ్ రాజు చల్లారావు, రామన్న పలువురు పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

### పేదల పెన్నిధి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి



**పాలకొల్లు,మేజర్** న్యూస్:మండలం సగం చెరువు గ్రామంలో వైసిపి పార్టీ అసెంబ్లీ అభ్యర్థి గుడాల శ్రీహరి గోపాలరావు సతీమణి గుడాల మంగతయారు కుటుంబ సభ్యులతో కలిసి ఇంటింటికి తిరిగి ఓట్లను అభ్యర్థించారు, జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తు పై ఓటు వేసి ఆయనని గెలిపించారని కోరారు, వైసీపీ ప్రభుత్వ హయాంలో సంక్షేమ పథకాలుపెన్షన్లు అమ్మ ఒడి విద్యాదీవెన జగనన్న ఆసరా నవరత్నాల వంటి అనేక పథకాలను రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పేద ప్రజలకు ప్రవేశపెట్టారని తిరిగి ఆయనను ముఖ్యమంత్రి చేసే బాధ్యత ప్రతి ఒక్కరి పైన ఉందని అన్నారు,ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కడలి నాగమణి శ్రీనివాస్ , మండలం గౌరవ అధ్యక్షులు మైలబత్తుల మైఖేల్ రాజు, రాష్ట్ర మహిళా సెక్రెటరీ మద్దా చంద్రకళ, జిల్లా యూత్ అధ్యక్షులు కూచున్నపల్లి విన్నునే బాబు , పాలకొల్లు మండలం బీసీ సెల్ అధ్యక్షులు నునబోయిన వెంకటేశ్వరావు మహిళానాయకురాలుగ్రామపెద్దలుపార్టీనాయకులు పాల్గొన్నారు..

### ఎన్నికల ప్రచారానికి
### ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు శ్రీకారం




**నూజివీడు,మేజర్‌న్యూస్ :** నూజివీడు శాసనసభ్యులు, నియోజకవర్గ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మేక వెంకట ప్రతాప్ అప్పారావు ఎన్నికల ప్రచార పర్వానికి సోమవారం సాయంత్రం శ్రీకారం చుట్టారు. స్థానిక ఎమ్మార్ అప్పారావు కాలనీలోని దేవాలయం లో ప్రతాప్ అప్పారావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రతాప్ అప్పారావు మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలో 99శాతం హామీలను అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి దేనని అన్నారు. రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించామని ప్రతాప్ అప్పారావు స్పష్టం చేశారు. సమాజంలోని ప్రతి ఇంటికి ఏదో విధంగా మేలు జరిగిందన్నారు. త్వరలో జరగనున్న ఎన్నికలలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ దేశానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రచారానికి వచ్చిన ప్రతాప్ అప్పారావు కు ప్రజలు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో పలువురు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

## బాధితులకు ఉచితంగా నిత్యావసర సరుకులు అందించిన నాయుడు




**నరసాపురం,మేజర్‌న్యూస్ :** వివిధ అనారోగ్యాలతో బాధపడుతున్న వ్యక్తులకు కొవ్వలి ఫౌండేషన్ ద్వారా ప్రతినెల ఉచితంగా నెలకు సరిపడా నిత్యవసర సరుకులను అందిస్తున్నారు. దీనిలో భాగంగా సోమవారం ఫౌండేషన్ చైర్మన్ కొవ్వలి యతి రాజా రామ్మోహన్ నాయుడు తన నివాసంలో నిత్యావసర సరుకులను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు రెండేళ్ల క్రితం కొవ్వలి ఫౌండేషన్ ఏర్పాటు చేసి ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్నామని అన్నారు. విద్య వైద్యానికి ఆర్థిక ఇబ్బందులు వల్ల బాధపడుతున్న వారిని గుర్తించి ప్రతి నెల వ్యాధుల బారి నుండి కోలు కునేందుకు మందులు అందిస్తున్నామన్నారు. పేదరికం వల్ల చదువులు ఆగిపోకూడదనే ఉద్దేశంతో అందరూ చదువుకుంటేనే దేశం అభివృద్ధి అవుతుందనే నమ్మకంతో అనేకమంది విద్యార్థులకు సహకారం అందిస్తున్నామన్నారు. పెన్షన్ కూడా రాకుండా ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న వారికి ప్రతి నెల అవసరమైన నిత్యవసర సరుకులు ఇస్తున్నామన్నారు. నియోజకవర్గంలో కనీస అవసరాలకు కూడా ఇబ్బందులు పడే ఎంతో మందిని కొవ్వలి ఫౌండేషన్ ద్వారా ఆదుకుంటున్నామని రామ్మోహన్ నాయుడు అన్నారు. రాజకీయాలకతీతంగా, కులమతాలకు అతీతంగా తమ సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నామనిఆయన అన్నారు.ఈ కార్యక్రమంలోపలువురు ఫౌండేషన్ సభ్యులు, రామ్మోహన్ నాయుడు అభిమానులు పాల్గొన్నారు.

## శెట్టిబలిజ యువభేరి విజయవంతం చేసినందుకు కృతజ్ఞతలు

### రాష్ట్ర అధ్యక్షులు శెట్టిబలిజ సంఘం : కుక్కల శ్రీనివాస్



**పాలకొల్లు, మేజర్‌న్యూస్:** పాలకొల్లు మండలం సగం చెరువు గ్రామంలో ఆదివారం జరిగిన శెట్టిబలిజ యువభేరి యువసేన వారికి ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షులు కుక్కల శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు, సోమవారం ఆయన కార్యాలయం నందు పత్రికా సమావేశం ఏర్పాటు చేశారు, ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ త్వరలో రాష్ట్ర కార్యవర్గాన్ని పూర్తిగా ప్రకటిస్తామని తెలిపారు 1920 సంవత్సరంలో శెట్టిబలిజ సంఘం వ్యవస్థాపకులు దొమ్మేటి వెంకటరెడ్డి ఈ సామాజిక వర్గం కోసం ఎనలేని కృషి చేశారని ఈ సందర్భంగా గుర్తు చేశారు, బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్ల కోసం సుదీర్ఘంగా పోరాడుతున్నామని, వైసిపి పార్టీ ముందుగానే బీసీలను గుర్తించి ఉభయ గోదావరి జిల్లాలో రెండు పార్లమెంటు సభ్యులకు, తూర్పుగోదావరి జిల్లాలో ఇద్దరు ఎమ్మెల్యేలకు పశ్చిమగోదావరి జిల్లాలో ఒక శెట్టిబలిజి సామాజిక వర్గానికి అవకాశం కల్పించి అభ్యర్థులను ప్రకటించడం ఆనందదాయకమన్నారు, తాను జిల్లా అధ్యక్షులుగా ఉన్నప్పుడు అనేక పట్టణాలలో సంఘ విస్తరణకు కృషి చేశానని రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైనందున మరింత విస్తృతంగా సమావేశాలు ఏర్పాటు చేసి రాష్ట్రస్థాయిలో ఒక పెద్ద సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు, ప్రతి శెట్టిబలిజ సామాజిక వర్గ అభ్యర్థులను బీసీలు ఎస్సీలు ఇతర కులస్తులు గెలిచే విధంగా కృషి చేయాలన్నారు, ఈ కార్యక్రమంలో నరసాపురం కన్వీనర్ గూడూరి రాజేష్, పెచ్చెట్టి ఏడుకొండలు, పెచ్చెట్టి వెంకటేశ్వరరావు ఎలమంచిలి మండల కన్వీనర్ మల్లుల సంజయ్ తదితరులు పాల్గొన్నారు,

### వైసిపి నుండి 30 మంది జనసేనలో చేరిక



**పెంటపాడు,మేజర్‌న్యూస్:** పెంటపాడు మండలం జట్లపాలెం గ్రామం నుంచి కుదుళ్ళ శ్రీనివాస్, పెనుబోతులసోమలమ్మ ఆధ్వర్యంలో మండల అధ్యక్షుడు పుల్లా బాబి అధ్యక్షతన జనసేన పార్టీ సిద్ధాంతాలు బొలిశెట్టిశ్రీనివాస్ సేవా కార్యక్రమాలు నచ్చి జగన్ మోసపూరిత హామీలతో విసుగుచెందితాడేపల్లిగూడెం అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్ చేతుల మీద జనసేనపార్టీ కండువా కప్పుకొని పార్టీలోకి సుమారు 30 మంది జాయిన్ అవ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో శెట్టి రాజు, శెట్టి సుధారాణి, చౌటిపల్లి వర ప్రసాద్, చౌటిపల్లి లలిత కుమారి,ముప్పిడి రామారావు, కంకిపాటి లీలావతి తదితరులు జాయిన్ అయ్యారు.

## చిన్న వెంకన్నను దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తి టి.మల్లికార్జున్ రావు



**ద్వారకతిరుమల,మేజర్‌న్యూస్:**ప్రముఖ పుణ్యక్షేత్రమైన చిన్న వెంకన్న ఆలయానికి సోమవారం ఉదయం రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి మల్లికార్జునరావు ఆలయానికి సందర్శించారు. ముందుగా స్వామివారి ప్రమోద కళ్యాణ మండపంలో స్వామివారి నిత్య కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించుకున్నారు.అనంతరం ఆలయ అధికారులు పండితులు దేవాలయ మర్యాదలతో పూర్ణకుంభ స్వాగతం పలికాగా ప్రదక్షిణలు అనంతరం స్వామి వారిని పద్మావతి ఆండాళ్ అమ్మవార్లను దర్శించుకుని పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం ఆలయ ముఖమండపంలో పండితులు వేద ఆశీర్వచనం పలికి స్వామివారి శేష వస్త్రాన్ని స్వామివారి జ్ఞాపికను సమర్పించారు. ఆలయ ఏఈఓ నటరాజు స్వామి వారి జ్ఞాపకను ప్రసాదాలను అందించారు. ఈ క్రమంలో సూపరింటెండెంట్,రమణ రాజు,సుబ్రహ్మణ్యం, స్థానిక ఎస్ఐ సతీష్, మండల ఆఫీసర్లు, వున్నారు.

## కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఉపాధి లక్ష్యంగా పాలన



**పెదవేగి,మేజర్‌న్యూస్:** గడచిన ఐదేళ్ళుగా రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందని, ఉపాధి అవకాశాలు లేక యువత వలస బాట పడుతున్నారని కాంగ్రెస్పార్టీ దెందులూరు నియోజకవర్గం కన్వీనర్ ఆలపాటి నరసింహమూర్తి అన్నారు. కాంగ్రెస్పార్టీ అధికారంలోకి వస్తే యువత ఉపాధి అవకాశాలే లక్ష్యంగా పరిశ్రమల స్థాపన, సంపద సృష్టికి చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు. పెదవేగి మండలం మ దూరులో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రానికి ప్రత్యేక హోదా వస్తే రాష్ట్రం ఈరోజు ఇలాంటి దుస్థితిలో ఉండేది కాదన్నారు. సీఎంగా జగన్ పూర్తిగా విఫలమయ్యాడని, ఏ ఒక్క వర్గంకూడా సంతోషంగా ఉన్నామని చెప్పే పరిస్థితి లేదని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. కాంగ్రెస్పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలిగా వైఎస్ షర్మిల బాధ్యతలు చేపట్టిననాటినుంచి కాంగ్రెస్పార్టీకి ప్రజల్లో ఆదరణ పెరుగుతూ వస్తోందని, దీనికి నిదర్శనం చింతలపూడి వైసీపీ ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా కాంగ్రెస్పార్టీలో చేరడమేనని ఆయన స్పష్టం చేశారు. ఇప్పటికే చాలామంది కాంగ్రెస్పార్టీలో చేరడానికి సిద్ధంగా ఉన్నారని, వచ్చే ఎన్నికల నాటికి కాంగ్రెస్పార్టీ మరింతగా పుంజుకుంటుందని, ఇదే స్ఫూర్తితో వచ్చే ఎన్నికల్లో పోటీ చేసి, విజయం దిశగా ముందుకెళ్తామని నరసింహమూర్తి అన్నారు.